803) రామక్రియ

ప॥ అతని గూడినప్పుడే అన్నియు సాధించవమ్మా । రాతిరాయ నికనైన రమ్మనవమ్మా ॥

చ॥ అంపినమాట కుత్తర మానతియ్యవమ్మా । వంపుమోముతో నలుక వలదమ్మా ।
పంపుడు చెలులమిదే పలుక విదేమమ్మా । చెంప జారిన తురుము చెరుగుకోవమ్మా ॥

చ॥ తమకించే పతితో నీతలపు లేమందుమమ్మా । కొమరు చూపుల లోన కోపమేలమ్మా ।
జమళినిద్దరి కూడిగములవారమమ్మా । చెమరించె మేనెల్లా చిన్నబోకువమ్మా ॥

చ॥ యెదురుగా వచ్చు నాతడిట్టె మమ్మంపవమ్మా । కదిసితి వికనీకు కడుమేలమ్మా ।
యెదుట శ్రీవేంకటేశు డేగివచ్చి నిన్నుగూడె । వదలడు దినమిట్టె వచ్చీ నోయమ్మా ॥